సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 15 । మార్చి । 2023



రోడ్డు భద్రతపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో కారు, ఆటో డ్రైవర్లకు కొన్ని జాగ్రత్తలు వివరించారు. ప్రమాదం జరిగితే 100కు సమాచారం అందించాలని కోరారు.



ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఆత్మస్థైర్యం, సమయస్ఫూర్తితో ముందుకు సాగితే విజయం మీ వెంటే ఉంటుంది. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.

8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కేటీఆర్‌ను కలిసిన ఎర్రోళ్ల శ్రీనివాస్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను టీఎస్ ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. విద్యార్థి ఉద్యమ నాయకుడుగా, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా శ్రీనివాస్ పనిచేశారు. ఈ క్రమంలో ఆయనకు బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై కేటీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్ కుమార్ ఉన్నారు.

18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

జ్యోతినగర్: ఈనెల 18న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

ఏప్రిల్ 3న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న తాడూరి శ్రీమాన్

పెద్దపల్లిరూరల్: వచ్చేనెల 3న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టే పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్ కోరారు. జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ముట్టడికి రాష్ట్రం నుంచి పదివేల మంది పాల్గొంటారని తెలిపారు. చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని బీసీ ఉద్యమాలను ఉధృతం చేసే దిశగా సంఘం సిద్ధమైందన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెట్టడం శోచనీయమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్‌గౌడ్, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల అధ్యక్షులు సింగారపు రవికుమార్, వింజమూర్ సురేశ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు నల్లవేల్లి అశోక్, నాయకులు గున్నాల రాములు, నూనె చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు 'డబుల్' ఇళ్ల కేటాయింపునకు లాటరీ

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించేందుకు బుధవారం లాటరీ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మీ తెలిపారు. పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణమండపం ఆవరణలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, కౌన్సిలర్ల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష




ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న మేరాజ్ అహ్మద్

పెద్దపల్లిరూరల్: ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ సమీక్షించారు. పెద్దపల్లి, మంథని కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ఎనర్జీ డ్రింక్స్ అందించాలని, వెనుకబడిన విద్యార్థులను మోటివేషన్ చేయాలన్నారు.

పైసలిస్తేనే పేరు మార్పు..!

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఒక వ్యక్తి ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దానిని తన పేరిట మ్యూటేషన్ కోసం మున్సిపాలిటీ సిబ్బందిని సంప్రదించాడు. దానికి వారు రూ.20వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.10వేలు ముట్టజెప్పటంతో పనిపూర్తి చేశారు.

రామగుండం కార్పొరేషన్‌లో ఇటీవల వాణిజ్య ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకున్న యజమాని.. మ్యూటేషన్ కోసం సంప్రదించగా బల్దియాలోని ఉద్యోగి దాని విలువ ఆధారంగా రూ.30వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.15వేలు ఇచ్చి పని పూర్తి చేసుకున్నాడు. ఇలా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ పేరుతో పైసలు ఇస్తే వెంటనే ఆమోదం.. లేకపోతే తిరస్కరిస్తూ దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నారు.



పెద్దపల్లి పట్టణ వ్యూ

బల్దియాల్లో మ్యూటేషన్ పేరుతో మాయాజాలం

- చేయి తడిపితేనే సరి.. లేదంటే తిరస్కరణే..
- కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

సాక్షి, పెద్దపల్లి: బల్దియాల్లోని ఇళ్లు, ప్లాట్లు, భూములు వంటి ఆస్తులేవైనా సరే ఒకరి నుంచి మరొకరు కొనుగోలు చేసిన దానికి సంబంధించి మున్సిపల్ మ్యూటేషన్ తప్పనిసరి. అది ఉంటేనే సంబంధిత ఆస్తులకు పన్ను రావడంతోపాటు భవన నిర్మాణాలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు అనుమతి జారీ చేస్తారు. అయితే కొందరు మున్సిపల్, పట్టణ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ విభాగం అధికారులు ఆస్తి విలువ మేరకు రూ.5వేల నుంచి ఎక్కువగా వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో గతేడాది 437 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 256 ఆమోదించారు. 178 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే మంథని మున్సిపాలిటీలో 52 దరఖాస్తులు రాగా.. అన్నీ ఆమోదించినట్లు అధికారులు చెబుతున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో వచ్చినవి వచ్చినట్లే ఆమోదం తెలుపుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో మ్యూటేషన్ పూర్తికాక మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను రికార్డుల్లో పాత యజమానుల పేర్లే కనిపిస్తున్నాయి. ఆస్తుల విలువలు భారీగా పెరిగిన నేపథ్యంలో యజమానులు మ్యూటేషన్ కోసం బల్దియాల చుట్టూ తిరిగితున్నారు.

సాకులతో తిరస్కరణ

మ్యూటేషన్‌లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోందని, అవినీతి జరుగుతోందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడే వాటి మొత్తం విలువలో మ్యూటేషన్ కోసం 14శాతం రిజిస్ట్రేషన్ శాఖ దరఖాస్తుదారుల నుంచి తీసుకుంటోంది. ఆస్తులు కొన్నవారు లేదా పేరు మార్పిడి అవసరమైనవారు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. సంబంధింత డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో మున్సిపల్ విభాగానికి పంపిస్తారు. వీటిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లాలి. అక్కడ ఫొటోలు తీసుకుని కొలతలు పరిశీలించాల్సి ఉంటుంది. వాటి హద్దులు గుర్తించి 15రోజుల్లోగా దరఖాస్తుదారులకు మ్యూటేషన్ పత్రం జారీ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎక్కడా అమలుకావడం లేదు. అన్ని సవ్యంగా ఉన్నా నెలల తరబడి అధికారులు సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఆన్‌లైన్‌లో అందే దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణకు వెళ్లకుండానే అధికారులు కుంటి సాకులతో తిరస్కరిస్తున్నారు. దీంతో బాధితులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసి ముడుపులు ముట్టజెపితే వెంటనే జారీ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తున్న కొనుగోలుదారుల ఫోన్ నంబర్లు తప్పుగా ఉంటుండటంతో వారిని సంప్రదించలేకపోతున్నామని, అందుకే పెండింగ్‌లో ఉంటున్నాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్లు చెబుతున్నారు.

ఎన్టీపీసీని సందర్శించిన డైరెక్టర్ భట్టాచార్య



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న డైరెక్టర్ భట్టాచార్య

జ్యోతినగర్: ఎన్టీపీసీ నిర్మాణ పనులను సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఉజ్వల్ కాంతి భట్టాచార్య మంగళవారం పరిశీలించారు. స్టేజీ-1లో నిర్మితమవుతున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు యూనిట్లను సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేభాశిస్ ఛటోపాధ్యాయ, ప్రాజెక్టు ఈడీ సునిల్ కుమార్, అధికారులతో కలిసి సందర్శించారు. ప్రాజెక్ట్ యూనిట్-1, 2 బాయిలర్, యాష్ హ్యాండ్లింగ్ పురోగతి, సీహెచ్‌పీ కంట్రోల్ రూంను పరిశీలించారు. యూనిట్ కమిషనింగ్ కోసం సీహెచ్‌పీ సంసిద్ధతను సమీక్షించారు. అనంతరం ఎన్టీపీసీ అధికారులు, బీహెచ్‌ఈఎల్ సీనియర్ అధికారులతో స్టీమ్ జనరేటర్ సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కమిషనింగ్ కోసం వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్ ఆవరణలో మొక్కలు నాటారు.

ఇంటర్ పరీక్షలకు సర్వంసిద్ధం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న 14 ప్రభుత్వ, మరో ఎనిమిది ప్రైవేట్ జూనియర్ కాలేజీలతోపాటు మైనార్టీ రెసిడెన్షియల్, రెండు మోడల్‌స్కూళ్లలో మొత్తంగా 25 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 11,952 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో ఫస్టియర్ 5,636 మంది, సెకండియర్ 6,316 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడంతోపాటు విద్యార్థులకు వసతులు కల్పించామని ఇంటర్ బోర్డు నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై పలు విషయాలను 'సాక్షి'కి తెలిపారు.

- 25 కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 11,952 మంది విద్యార్థులు
- ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- అందుబాటులో వైద్యసిబ్బంది

'సాక్షి'తో ఇంటర్ నోడల్ ఆఫీసర్ కల్పన



సాక్షి: జిల్లాలో జూనియర్ కాలేజీలు ఎన్ని ఉన్నాయి..?

కల్పన: జిల్లాలో మొత్తం 25 కాలేజీలున్నాయి. అందులో ప్రభుత్వ కాలేజీలు 14, ప్రైవేట్ 8, మోడల్ కళాశాలలు రెండు, ఒకటి మైనార్టీ కాలేజీ ఉంది.

సాక్షి: విద్యార్థులను పరీక్షాకేంద్రంలోకి ఎప్పుడు అనుమతిస్తారు..?

కల్పన: బుధవారం నుంచి (15వ తేదీ) మొదలయ్యే పరీక్షలు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు సాగుతాయి. విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 8.30 నుంచే కేంద్రంలోకి అనుమతిస్తాం. తొమ్మిది గంటలు దాటి ఒక్క నిమిషం అయినా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం.

సాక్షి: ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల పరిస్థితి ఏంటి..?

కల్పన: పరీక్ష సమయానికి అనుగుణంగా కేంద్రాలున్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. ఈ మేరకు ఇప్పటికే కలెక్టర్ ఆర్టీసీ అధికారులకు ఆదేశాలిచ్చారు.



సాక్షి: ఇంటర్ పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు..?

కల్పన: మొత్తం 11,952 మంది విద్యార్థులున్నారు. వీరిలో వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 2,336 మంది ఉన్నారు.

సాక్షి: ఎంతమంది ఇన్విజిలేటర్లను నియమించారు..?

కల్పన: పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి కేంద్రానికి ఓ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ 25 మంది చొప్పున నియమించాం. మొత్తంగా 600 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

సాక్షి: మాస్‌కాపీయింగ్ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కల్పన: కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించాం. వీరే కాకుండా అన్ని సెంటర్లను ఆకస్మికంగా సందర్శించేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను కూడా ఏర్పాటు చేశాం. అంతే కాకుండా పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించాం. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించారా..?

కల్పన: పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి వసతి కల్పించాం. ఆరోగ్యపరమైన సమస్యలు ఏర్పడితే సత్వర వైద్యం కోసం ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సూచనలేంటీ..?

కల్పన: పరీక్షా కేంద్రాలకు అల్పాహారం చేసి సకాలంలో చేరుకోవాలి. ఏమైనా ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ నంబరు 9440850216 లో, మానసిక ఇబ్బందులకు గురైతే టోల్‌ఫ్రీ 14416కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

మైనర్లపై లైంగిక దాడులు ఆపాలి



కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

- మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలి
- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

సుల్తానాబాద్: మైనర్లపై లైంగికదాడులు ప్రభుత్వం, పోలీసులు ఆపాల్సిన అవసరం ఉందని సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, అందుకే వారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల శ్రమకు తగిన ఫలితం అందడం లేదని, వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి మహిళలపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని అన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా వేతనం చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించి రోజుకు రూ.600 చెల్లించాలని, ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి వర్గసభ్యుడు వేల్పుల కుమార్ స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.మహేశ్వరి, ప్రజాసంఘాల నాయకులు లావణ్య, ప్రశాంత్, షైముద, శివాజీ, రాజు, ఖాజా, అంజయ్య, రమణ, స్వరూప, సమ్మక్క, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ సంగీత



అప్పన్నపేటలో పర్యటిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. మంగళవారం అప్పన్నపేటలో మన ఊరు-మన బడి కింద ఎంపికైన ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు కంటి వెలుగు వైద్యశిబిరం, సంచార ప్రయోగశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలలో టాయిలెట్లు, కిచెన్ షెడ్ నిర్మాణం, డైనింగ్ హాల్, ఫ్లోరింగ్ పనులు ఏప్రిల్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కంటి వెలుగు..

కంటివెలుగు వైద్య శిబిరంలో రీడింగ్ కళ్లద్దాల స్టాక్ వివరాలు, డిస్క్రిప్షన్ కళ్లద్దాల పంపిణీ, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దష్ట్యా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయాలని సూచించారు.

సంచార ప్రయోగశాల..

సంచార ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలను ఉపాధ్యాయులు వివరిస్తున్న అంశాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కృత్యధార బోధనకు పెద్దపీట వేసి గుణాత్మక విద్య అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచులు, నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంచారవిజ్ఞాన గణిత ప్రయోగశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రయోగాల ద్వారా విద్యార్థులకు మరింత సులభతరంగా పాఠ్యాంశాలు బోధిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశీలనాత్మక దృష్టి పెంపొందించేలా ఉపాధ్యాయుల కృషి చేయాలని, 2021లో ఏర్పాటైన ఈ ప్రత్యేక సంచార ప్రయోగశాల కార్యక్రమం మంచి ఫలితాలు సాధించినందున ప్రస్తుతం కొనసాగిస్తున్నామని అన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరూ మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అందుబాటులో ఉన్న స్వల్ప సమయాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని, అన్ని సబ్జెక్టులతో కూడిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు హనుమంతు, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు, విషయ నిపుణులు సీహెచ్.మల్లేష్ గౌడ్, కే.జగదీశ్వర్ రెడ్డి, పి.సురేందర్, అనిల్ కుమార్, చొక్కారావు, తిరుపతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి వైద్యుల సూచనలు పాటించాలి

పెద్దపల్లిరూరల్: మహిళలు సంపూర్ణ ఆరోగ్యానికి వైద్యుల సూచనలు తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాకేంద్రంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మహిళా ఆరోగ్య కేంద్రాల ద్వారా ఎనిమిది విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తారని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సతోపాటు మందులు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. క్లినిక్‌కు వచ్చే వారి వివరాలు యాప్‌లో నమోదుచేయాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, బి.మహేందర్ కుమార్, ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి స్వప్న పాల్గొన్నారు.

సఖీ సెంటర్ ద్వారా మహిళలకు సేవలు

సఖీ సెంటర్ ద్వారా బాధిత మహిళలకు ప్రత్యేక సేవలందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రంగంపల్లిలో నిర్మిస్తున్న సఖీ సెంటర్ పనులను పరిశీలించారు. ఆడపిల్లల అమ్మకం, రవాణా నివారణకు హెల్ప్‌లైన్ నంబర్ 181పై ప్రచారం చేయాలన్నారు. అనంతరం రెసిడెన్షియల్ బ్రిడ్జి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఐదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, శంకరయ్య, పాఠశాల ఇన్‌చార్జి డి.సతీశ్ పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు 'గుర్తింపు' ప్రతిష్టాత్మకం..!

- మరో రెండు నెలల్లో గుర్తింపు ఎన్నికలు
- ఆరుజిల్లాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులపై ప్రభావం

గోదావరిఖని: సింగరేణిలో జరిగే గుర్తింపు ఎన్నికలు ప్రధాన పార్టీలకు కీలకంగా మారనున్నాయి. మరో రెండు నెలల్లోనే ఈ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీటి ప్రభావం మరో ఆరునెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలపై పడనుంది. ఈక్రమంలో సింగరేణి ఎన్నికలు అన్ని పార్టీలకూ ప్రతిష్టాత్మకం కానున్నాయి. గుర్తింపు ఎన్నికల్లో సంస్థ వ్యాప్తంగా ఉన్న సుమారు 42వేల మంది కార్మికులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు ప్రత్యక్షంగా 42వేల మంది, పరోక్షంగా మరో 25వేల కాంట్రాక్టు కార్మికులపై ప్రభావం చూపనున్నాయి. కార్మిక కుటుంబాలు, కార్మికులపై ఆధారపడే వాణిజ్య, వ్యాపార, కులవృత్తుల వారితో కలిపి సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 3లక్షల మందిపై ఈ ఎన్నికలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. గతంలోనూ గుర్తింపు ఎన్నికలు ఇలాగే అసెంబ్లీ ఎన్నికల ముందే జరిగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గుర్తింపు ఎన్నికల్లో ప్రచారం చేశాయి. సింగరేణి విస్తరించిన పెద్దపల్లి, మంచిర్యాల, కొమురం భీంఆసిఫాబాద్, జయశంకర్‌భూపాల్‌పల్లి, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు అనుబంధంగా ఉన్న యూనియన్లు పోటీలో తలపడనున్నాయి. దీంతో గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన యూనియన్లకు కార్మికుల మద్దతు లభిస్తుంది. అంతేకాకుండా గెలిచిన యూనియన్లు గనులపై అసెంబ్లీ ఎన్నికల్లో గేట్‌మీటింగ్‌ల ద్వారా ప్రచారం చేసుకునే అవకాశం లభిస్తుంది. దీంతో కార్మికుల మద్దతు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

ప్రధాన పార్టీల యూనియన్లు ఇవే..

ప్రధాన పార్టీలకు అనుబంధంగా సింగరేణిలో యూనియన్లు ఉన్నాయి. ఈ యూనియన్లు కార్మికుల ఓట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం గుర్తింపు యూనియన్‌గా ఉన్న టీబీజీకేఎస్ అధికార బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా కొనసాగుతోంది. ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్‌కు, బీఎంఎస్ బీజేపీకి, ఏఐటీయూసీ సీపీఐకి, సీఐటీయూ సీపీఎంకు, టీఎన్‌టీయూసీ టీడీపీకి అనుబంధంగా కొనసాగుతున్నాయి. వీటితోపాటు విప్లవ కార్మిక సంఘాలూ ఉన్నాయి. మరో రెండు నెలల్లో గుర్తింపు ఎన్నికలు, మరో ఆరునెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధం ఉండటంతో ఈసారి జరిగే గుర్తింపు సంఘం ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే ధ్యేయంగా ప్రచారం నిర్వహించే అవకాశాలున్నాయి.



క్లుప్తంగా

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి


డాక్టర్ నగేశ్

ధర్మారం(ధర్మపురి): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి చైర్మన్‌ను బాధ్యున్ని చేసి వెంటనే బర్తరఫ్ చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు పేపర్ లీకేజీ శాపంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలన మూలంగానే పరీక్ష పేపర్ లీకైందని విమర్శించారు. లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే యువకులు హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లి లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటుండగా పేపర్ లీకేజీ కావడం దురదృష్టకమన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రేమ విఫలమైందని ఆత్మహత్య

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురై మండలకేంద్రానికి చెందిన ఓ అబ్బాయి (19) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి అబ్బాయి తల్లిదండ్రులు, సోదరి నాలుగు నెలలుగా కరీంనగర్‌లో నివసిస్తున్నారు. పది రోజుల క్రితం అబ్బాయి స్వగ్రామానికి వచ్చి తాత, నానమ్మతో కలిసి ఉంటూ.. కాట్నపలిలోని ఓ రైస్‌మిల్‌లో కూలీ పని చేసుకుంటున్నాడు. అతడికి కొంతకాలంగా బంధువుల అమ్మాయితో స్నేహం ఉంది. అది ప్రేమగా భావించిన అబ్బాయి.. అమ్మాయిని అడగగా ఆమె తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


అరవింద్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తండ్రి మందలించాడని సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్‌కు చెందిన మారవేణి అరవింద్ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ ఉపేందర్‌రావు వివరాలు.. అరవింద్ డిగ్రీ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఖాళీగా ఎందుకు ఉండడం, వ్యవసాయ పనులకు రావాలని తండ్రి అంజయ్య మందలించినందుకు మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి తమ పొలం వద్ద పురుగుల మందు తాగగా, కుటుంబీకులు గమనించి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మొదట కరీంనగర్, అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా అరవింద్ బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా పనిచేస్తుండగా, బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- పక్షం రోజుల్లో పది పరీక్షలు
- సమయపాలన పాటించాలి
- 15 రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- పదో తరగతి విద్యార్థులకు 'సింగరేణి' ఉపాధ్యాయుల సూచనలు


విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆత్మస్థైర్యం, సమయస్ఫూర్తితో ముందుకు సాగితే విజయం మీ వెంటే ఉంటుంది. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్ది మొదలయ్యే టెన్షన్ తగ్గించుకోవాలి. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించాలి. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న క్రమంలో ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వివిధ సబ్జెకుట ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు..

ప్రశ్నలను అర్థం చేసుకోవాలి



నీట్ హ్యాండ్ రైటింగ్ ప్రజంటేషన్ ముఖ్యం. విద్యార్థులు ఎక్కువగా భయపడేది ఇంగ్లిష్ పరీక్షకే. ప్రశ్న పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివిన తర్వాత అర్థం చేసుకొని జవాబులు రాయాలి. గ్రామర్ నేర్చుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. బాగా వచ్చిన ప్రశ్నలు ముందు రాయాలి.
– జి.పురుషోత్తం,హెచ్ఎం, ఇంగ్లిష్ టీచర్

అక్షరదోషాలపై దృష్టి సారించాలి



మాతృభాష అని తేలికగా తీసుకుంటారు. అందమైన చేతి రాత ముఖ్యం. అక్షర దోషాలు లేకుండా రాయాలి. పదాల నిర్మాణం అర్థవంతంగా ఉండాలి. తెలుగు పరీక్షల్లో అక్షర దోషాలకు మార్కులు తక్కువ పడే అవకాశం ఉంటుంది. గ్రామర్‌పై పట్టు సాధించాలి. పరీక్షకు 15 నిమిషాల ముందే ప్రశ్న పత్రం ఇస్తున్నారు. దీంతో మంచి మార్కులు సాధించే వీలుంది. జవాబులను పేరాలుగా విడదీసి రాయాలి. – ఎం పద్మ, తెలుగు టీచర్

తెలిసిన ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మొదట ప్రశ్నపత్రంలోని తెలిసిన ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రేఖా చిత్రాలు ముఖ్యం. బిట్ పేపర్‌పై దృష్టి సారించాలి. ఎలక్ట్రానిక్స్ విన్యాసాలు రాసే పద్ధతి, నియమాలు కూడా ముఖ్యం. ప్రశ్న, బిట్ నంబర్ తప్పనిసరిగా రాయాలి. సైడ్ హెడ్డింగ్స్ పెట్టాలి. అనవసరమైన విషయాలు కాకుండా ప్రశ్నకు సంబంధించిన జవాబులు సూటిగా రాయాలి.
– డి.నాంచారయ్య, ఫిజిక్స్ టీచర్

ఏకాగ్రత ముఖ్యం



ప్రతి చాప్టర్ ముఖ్యమైనదే. ఏకాగ్రతతో ప్రాక్టీస్ ఎక్కువ చేస్తే తిప్పితిప్పి అడిగిన ప్రశ్నలకు ఆన్సర్ చేయగలుగుతారు. గ్రాఫ్ కన్‌స్ట్రక్షన్స్ రిపీటెడ్ ప్రశ్నలపై పట్టు సాధించాలి. ప్రాబబులిటి, స్టాటిస్టిక్స్ కో ఆర్డినేట్ జామెట్రి, ప్రోగ్రెషన్స్ చాప్టర్లు ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే మంచి స్కోరింగ్ చేయవచ్చు. మ్యాథ్స్ సూత్రాలను క్రమం తప్పకుండా గుర్తు చేసుకుంటూ పాఠ్యాంశాలను పరిగణనలోకి తీసుకొని సమాధానాలు వచ్చేలా సాధన చేయాలి. – పి.రమేశ్, మ్యాథ్స్ టీచర్

ఎక్కువ స్కోరింగ్ పేపర్ హిందీ



హిందీ పరీక్ష అనగానే విద్యార్థులు భయపడుతుంటారు. అన్ని సబ్జెక్టుల కన్న హిందీలో ఎక్కువ మార్కులు సాధించాలంటే గ్రామర్‌పై పట్టు ఉండాలి. ప్రశ్నలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. కవి పరిచయాలపై శ్రద్ధచూపాలి. గద్యం, పద్యంపై పేరలపై అవగాహన ఉంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పుస్తకంలో ఉండే పాఠ్యాంశాలపై ఎక్కువ దృష్టి సారిస్తే మంచి మార్కులు వస్తాయి.
– ఎస్.పల్లవిఇంద్రాణి, హిందీ టీచర్

దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్టిక్ హబ్‌లో ఖాళీగా ఉన్న ఆరు పోస్టుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఈనెల 25న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని కలెక్టర్ సంగీత తెలిపారు. ఎండీ పాథాలజీ, ఎండీ బయోకెమిస్ట్రీ, ఎండీ మైక్రోబయాలజీ, ఎండీ రేడియాలజీ, ల్యాబ్ మేనేజర్ (ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ), రేడియోగ్రాఫర్ (డిప్లొమా బీఎస్సీ రేడియాలజీ/డీ ఎంఐటీ) పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన అర్హులైన వైద్య అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులు ఈనెల 25న 11 గంటలలోపు దరఖాస్తులను జిల్లా ఆస్పత్రిలో అందించడంతోపాటు అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సూపరింటెండెంట్ చాంబర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శ్రీధర్‌ను సెల్‌నంబర్ 8499061999లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భీష్మాచారికి అవార్డు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామానికి చెందిన సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి గ్లోబల్ హ్యుమానిటీ చేంజ్‌మేకర్ అవార్డు– 2023కు ఎంపికయ్యాడు. రాజస్తాన్ రాష్ట్రంలో ఈనెల 11, 12వ తేదీల్లో అంతర్జాతీయ సామాజిక సేవకుల సదస్సు జరిగింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి భీష్మాచారితో పాటు 786 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డు, ప్రశంసాపత్రాన్ని కార్గిల్ యుద్ధయోధులు కల్నల్ దీప్‌చంద్, కల్నల్ హేమ్‌సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా భీష్మాచారిని గ్రామస్తులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు అభినందించారు.

బొగ్గుబాయి వార్తలు

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఉపేందర్‌రావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సైబర్ నేరాలపై తల్లిదండ్రులతో పాటు బంధువులకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ ఉపేందర్‌రావు విద్యార్థులకు సూచించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని గురుకుల సాంఘీక సంక్షేమ విద్యాలయంలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు రెస్పాండ్ కావద్దన్నారు. ఏవరైనా సైబర్ క్రైమ్‌కు గురయితే వెంటనే www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు. షీ టీంకు ఫిర్యాదు చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని, దీనిద్వారా ఎక్కడినుంచయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. క్యూఆర్ కోడ్ బస్టాండ్, సినిమా హాల్స్, స్కూళ్లు, కళాశాలలు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో అతికించబడి ఉన్నయని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే అంత భవిష్యత్ బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్‌తో పాటు ట్రాఫిక్ రూల్స్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నదిలో దూకేందుకు ఇద్దరు మహిళల యత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నించిన ఇద్దరు మహిళలను రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్, రివర్ పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ జ్యోతినగర్‌కు చెందిన ఓ మహిళ కొడుకు ఇటీవల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త గతంలోనే అనారోగ్యంతో మరణించాడు. ఇద్దరు మృతితో ఒంటరైన సదరు మహిళ మనస్తాపానికి గురై నదిలో దూకే ప్రయత్నం చేయగా అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు కాపాడి ఆమె బంధువులకు అప్పగించారు. అలాగే గోదావరిఖనికి చెందిన మరో మహిళా కుటుంబ సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై బ్రిడ్జి వద్దకు వచ్చి నదిలో దూకే ప్రయత్నం చేయగా రివర్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఇద్దరు మహిళలను కాపాడిన రివర్ పోలీసులు సదానందం, శ్రీనివాస్, వెంకటస్వామిని టూటౌన్ సీఐ వేణుగోపాల్ అభినందించారు. ఆత్మహత్యలు చేసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని సీఐ సూచించారు.



పరిమితికి మించి..!

పరిమితికి మించి ప్రయాణాలు చేస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు కొందరు. ఎవరికి ఎలా ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని ఈ రోజుల్లో అవగాహన లేమితో కొందరు వాహనదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఏదైనా జరిగితేనే హడావుడి చేసే అధికారులు అప్పుడప్పుడూ తనిఖీలు చేసి డ్రైవర్లకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు ఈ చిత్రం చూసినవారు. సుల్తానాబాద్ మండలం గర్రెపెల్లి వద్ద రాజీవ్‌రహదారిపై వ్యవసాయ కూలీలను పరిమితికి మించి ఓ ఆటో ఇలా వెళ్తుండగా కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఆన్‌లైన్‌లో ఆరోగ్య సమాచారం


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఉద్యోగుల సమాచారం ఇకనుంచి ఆన్‌లైన్ శాప్ (సిస్టం అప్లికేషన్ ప్రాజెక్టు)తో అనుసంధానిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రి మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వైద్య వివరాలు శాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు వివరించారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వ్యాధులు, రెఫెరల్ వివరాలు, ఫిట్, అన్‌ఫిట్ సమాచారం, ప్రస్తుతం రోగి పరిస్థితి, అందుతున్న వైద్యం, మందులు తదితర వివరాలను శాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ ఉపయోగించుకుని సింగరేణి ఆసుపత్రిలో మెడికల్ ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, కార్పొరేట్ ఐటీ డీజీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక బొగ్గు రవాణాలో ఉద్యోగుల కృషి భేష్

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ


బహుమతులు అందజేస్తున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని(రామగుండం): అత్యధిక బొగ్గు రవాణాలో సీఎస్పీ ఉద్యోగుల కృషి అభినందనీయమని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. బొగ్గు రవాణాలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగులకు మంగళవారం బహుమతులు అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, జనవరిలో జీడీకే–1 సీఎస్పీ నుంచి అత్యధికంగా 117 రేకుల బొగ్గు రవాణా చేసి రికార్డు నెలకొల్పారన్నారు. సమష్టి కృషి, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనగంటి శ్రీనివాసరావు, గని మేనేజర్ రమేష్‌బాబు, సీహెచ్‌పీ హెచ్ఓడీ దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మారుద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సురేందర్ తదితరులు

సుల్తానాబాద్: జిల్లాను టీబీ రహితంగా మార్చడానికి అందరూ సహకరించాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం నిక్షయ్ పోషణ్‌యోజనలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా పాజిటివ్ వచ్చిన వారితోపాటు షుగర్, బీపీ ఉన్నవారు టీబీ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా తెమడ పరీక్షలు చేయబడతాయని, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇవ్వడంతోపాటు పోషకాహారం కోసం రూ.500 ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సురేందర్, ఏఎన్ఎం సరస్వతి, కౌన్సిలర్ గోపి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పలువురు ఉన్నారు.

సుజాతకు బెస్ట్ యోగా మాస్టర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సుజాత

గోదావరిఖనిటౌన్(రామగుండం: గోదావరిఖనికి చెందిన పోరెడ్డి సుజాత బెస్ట్ యోగా మాస్టర్ నేషనల్ అవార్డు–2023 అందుకున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అవార్డు సెలక్షన్ నేషనల్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 6వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.యు.సుబ్రహ్మణియర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీడేటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు రాధాకృష్ణ పేర్కొన్నారు.

హామీలు మరిచిన ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి


కుమ్మరికుంటలో పర్యటిస్తున్న విజయరమణారావు

జూలపల్లి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజరమణారావు అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల కోసం ఇందిరమ్మ రాజ్యం తెస్తామని, పేదల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తామని అన్నారు. నాయకులు రవీందర్‌రావు, కొమ్మ పోచాలు, ఈర్ల స్వామి, రమేశ్, తీగెల శ్రీకాంత్, జగదీశ్, దేవేందర్ రెడ్డి, కనుకుంట్ల అంజయ్య, బండి స్వామి, బండారు సునీల్, సిద్ధం స్వామి, అంజయ్య పాల్గొన్నారు.





పిచ్చుకల కిలకిలలు

పెరుగుతున్న టెక్నాలజీ కావచ్చు.. ఇతర కారణాలేవైనా కావచ్చుగానీ పిచ్చుకల సందడి మాత్రం తగ్గిపోయింది. ఇలాంటి నేపథ్యంలో పెద్దపల్లి శివారు రాఘవాపూర్ గ్రామంలోని పంట పొలాల్లో పూల మొక్కలపై వాలుతూ.. అందంగా ఆడుకుంటూ 'సాక్షి' కెమెరాకు చిక్కాయి పిచ్చుకలు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి